సేవా భావంతో విధులు నిర్వహించాలి

వైద్య సిబ్బందికి నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10: జాతీయ ఆరోగ్య పథకం కింద ఒప్పంద పద్ధతిన నియమితులైన వైద్య సిబ్బంది సేవా భావంతో విధులు నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఒప్పంద పద్ధతిన స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మాసిస్టులు, ఇతర క్యాడర్లలో నియమితులైన వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్ తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. జాతీయ ఆరోగ్య పథకం కింద 58 మందిని ఒప్పంద పద్ధతిన నియమించినట్లు తెలిపారు. నియామకమైన వారు విధుల్లో సమయపాలన పాటిస్తూ సీజనల్ వ్యాధులు, విష జ్వరాలను నియంత్రించేందుకు కృషి చేయాలని తెలిపారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

నస్పూర్, సెప్టెంబర్ 10 : జిల్లాలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో అధికారులు నిత్యం పర్యటించాలన్నారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో మురుగు కాలువలు, అంతర్గత రహదారులు, నివాస ప్రాంతాల్లో నిలిచిన వరద నీటి తొలగింపు, తాగునీటి ట్యాంకుల్లో నీటి మార్చడం, వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేకాధికారులు నిత్యం ఉదయం తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి, పనుల పురోగతిపై వాట్సాప్ ద్వారా పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 10 : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేశ్ మండపాల నిర్వాహకులు మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించడంతో పాటు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేయాలని మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తలసేమియా, సికిల్ సెల్ బాధితులు, ప్రభుత్వ దవాఖాన గర్భిణులు, డెంగ్యూ బారిన పడిన బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331762

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

బెల్లంపల్లి: 91827 77671, 91827 77677

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

చెన్నూర్‌లో రజక సంఘం నాయకులు..

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 10 : తెలంగాణ వీర వనిత, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఐలమ్మ సేవలు మరువలేనివని, ఆమె సాధించిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని రజక సంఘం ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచారి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటాలను కొనియాడారు.

మంచిర్యాల అర్బన్ : రజక సంఘం ఆధ్వర్యంలో..

నస్పూర్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన తహసీల్ కార్యాలయంలో..

తాండూర్ ఏబీలో రజక సంఘం సభ్యులు..

మెరుగైన వైద్య సేవలందించాలి

వేమనపల్లి, సెప్టెంబర్ 10 : దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల డీఎంహెచ్‌వో హరిశ్‌రాజ్ అన్నారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబ్, ఐపీ వార్డు, ప్రసూతి గది, ఐఎల్‌ఆర్, డీ ఫ్రీజర్, రికార్డులు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. దవాఖానలో రోగులతో వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. త్వరలోనే ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు స్టాఫ్ నర్సులను కేటాయిస్తామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, వైద్యులు అనిల్, రాజేశ్, హెల్త్ సూపర్‌వైజర్ అపరంజి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ బాపు, ఫార్మాసిస్టు మంజుల, ల్యాబ్ టెక్నిషియన్ సౌందర్య, డీఈవో శివ ప్రసాద్ పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 10 : చెన్నూర్ మండలం అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో సందర్శించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్యులు, ప్రజలకు ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. వైద్యుడు సుధాకర్, కృష్ణ తేజ, హెచ్ ఈవో జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన అభ్యాసన సామర్థ్యాలు అందించాలి

కాసిపేట, సెప్టెంబర్ 10 : ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన అభ్యాసన సామర్థ్యాలు అందించాలని మంచిర్యాల డీఈవో ఎస్ యాదయ్య పేర్కొన్నారు. కాసిపేట మండలం దేవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవాపూర్ జడ్పీ పాఠశాలతో పాటు దేవాపూర్ ప్రైమరీ, పోలీస్ స్టేషన్ బస్తీ, మహేంద్ర బస్తీ, గట్రావ్ పల్లి, సోనాపూర్, నాయకపుగూడ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ అమలు విధానంపై అడిగి తెలుసుకున్నారు. స్వయంగా విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్ఎం, నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ ఉన్నారు.

పోషణమాసం సంబురాలు

దండేపల్లి, సెప్టెంబర్ 10 : దండేపల్లి మండలం మోకాసీగూడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్షెట్టిపేట సీడీపీవో రేష్మ మాట్లాడారు. అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

తాండూర్, సెప్టెంబర్ 10 : రాష్ట్రీయ పోషణ మాస సంబరాలు మండలంలోని మాదారం, తాండూర్ సెక్టార్లలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సుజాత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కవిత హాజరై, అవగాహన కల్పించారు. తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 10 : లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డులో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో కిశోర బాలికలు, బాలింతలు, పిల్ల తల్లులకు పోషక పదార్థాలపై సూపర్‌వైజర్ మమత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శంకరమ్మ, రాధిక, సుగుణతోపాటు చిన్నారుల తల్లితండ్రులు, బాలికలు, బాలింతలు పాల్గొన్నారు.

వెండి కిరీటాల బహూకరణ

దండేపల్లి, సెప్టెంబర్ 10 : దండేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతా రామా ఆలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు దండేపల్లికి చెందిన గోలి రాజేశం, గోలి నగేశ్, సంగీత రూ.1.35లక్షల విలువైన వెండి కిరీటాలను బహూకరించారు. అంతకుముందు ఊరేగింపుగా ఆలయానికి కిరీటాలను తీసుకువచ్చి అలంకరించారు. ఆర్య వైశ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ సభ్యులు ఉన్నారు.

వర్షాలకు రోడ్లపై నిలిచిన వరద

కౌటాల, ఆగస్టు 10 : మండలంలో సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని రోడ్లపైకి వరద చేరింది. ఇటీవలే చాలా రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు, పొంగిపొర్లాయి. తాజా వర్షాలతో వరద ఉధృతికి మండలంలోని ముత్తంపేట, తలోడి, మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, పాత క్వార్టర్ సమీపంలోని ప్రధాన రహదారులపై నీరు చేరింది. మండల కేంద్రంలోని నాళాలు ఆక్రమణలకు గుకవడంతో మార్కెట్ ఏరియా, పాత క్వార్టర్ సమీపంలో రోడ్లపై నీరుచేరి ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

జైనూర్‌లో ప్రశాంత వాతావరణం

జైనూర్, సెప్టెంబర్ 10: జైనూర్‌లో ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలీసులు చేపడుతున్న పటిష్ట బందోబస్తుతో ప్రశాంత వాతావరణం నెలకొంటున్నది. ప్రతి రోజూ పోలీసు బలగాలు కవాతు నిర్వహిస్తూ, ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పర్యవేక్షిస్తుండడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వివిధ దారుల్లో చెక్‌పోస్టులతో తనిఖీలు చేసి అల్లర్లు పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. అడిషనల్ ఐజీ రాష్ట్ర శాఖ పోలీసులు, తెలంగాణలోని పది జిల్లాల పోలీసులు బలగాలతో జైనూర్‌లో భద్రత చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేయడంతో బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ శాఖలలో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు తెరిచి ఉన్నాయి. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ మండలంలోని ఆదివాసీ సర్మేడీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు ఆదివాసులు సహకరించాలని కోరారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

దహెగాం, సెప్టెంబర్ 10 : అవసరమున్న ప్రతీ గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. మండలంలోని బోర్లకుంట, ఐనం, చిన్నరాస్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామాల్లో జ్వరాల తీవ్రత, అందుతున్న వైద్యంగురించి వైద్యాధికారి అశ్వినిని అడిగి తెలుకున్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యపరీక్షలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులతో పాటు, క్లోరినేషన్ చేయాలని సూచించారు. వినాయక మండపాల వద్ద శుభ్రంగా ఉంచాలని, లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితా సకాలంలో తయారుచేయాలన్నారు. విశ్వకర్మ పథకంలో దరఖాస్తులను అన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్ పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం సమీక్షలో చైర్మన్

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 10 : హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య పాల్గొన్నారు. తన అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్ల మేయర్లు, 12 మున్సిపాలిటీల చైర్మన్లు పాల్గొన్నారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు, చేపట్టిన పనులు, నిధుల వాడకం, తదితర అంశాలపై చర్చించిన కమిషన్.. 16వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులపై చర్చించింది. మంచిర్యాల మున్సిపాలిటీకి సంబంధించి విపత్తుల నిర్వహణ, డంప్‌యార్డుల ఏర్పాటు, పార్కుల నిర్మాణం, తాగునీటి సమస్య, రైల్వే ఫ్లైఓవర్, రోడ్లపై ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు, తదితర సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చైర్మన్ తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్లను నియమించండి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని మంగళవారం రెబ్బెన మండలం కైర్‌గాం మాజీ ఉపసర్పంచ్ నిక్కొండ వెంకటరమణ చారి డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రావు, తుమోజు వెంకటేశ్‌చారి పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్.. వెల్లడించిన ఏసీపీ

చెన్నూర్ టౌన్, సెప్టెంబర్ 10 : కోటపల్లి మండలం పారుపల్లిలోని వైన్ షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీఐ రవీందర్, చెన్నూర్, కోటపల్లి ఎస్ఐలు శ్వేత, రాజేందర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. 1వ తేదీన రాత్రి పారుపల్లిలోని ఎంఎస్ వైన్స్‌ను మూసివేసిన తర్వాత నిందితులు రూ.1,43,280 విలువైన మద్యం, ఒక సీసీ కెమెరా, రూ.31,370 చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. కోటపల్లి మండలం బొగుడగూడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మేకల లక్ష్మణ్ (30), పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికలపేటకు చెందిన మేకల కాపరి కోట కుమార్ (32)ను పట్టుకున్నారు. బొగుడగూడకు చెందిన కోట ధర్మేందర్ (30), పెంచికలపేటకు చెందిన ఆటో డ్రైవర్ అలకుంట బన్నీ (20) పరారీలో ఉన్నట్లు ఏసీపీ వివరించారు. నిందితులు ముందుగా చెన్నూర్‌లో ఆటో దొంగిలించారు. ఆ తరావత పారుపల్లి వైన్స్‌లో చోరీకి పాల్పడి, అదే ఆటోలో నెన్నెల మండలం దమ్మిరెడ్డికి వెళ్లారు. తెలిసిన వారి ఇంట్లో తలదాచుకున్నారు. తర్వాత రోజు వారి వద్ద ఉన్న మందును అమ్ముకునేందుకు సర్వాయిపేట వైపు వస్తున్నారు. సర్వాయిపేట ఎక్స్ రోడ్ వద్ద మధ్యాహ్నం కోటపల్లి ఎస్ఐ, తన సిబ్బందితో తనిఖీ చేస్తుండగా, వారిని పట్టుకొని విచారించారు. ఆటో, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నటుల ఏసీపీ వెల్లడించారు.

నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 10 : శాంతియుత వాతావరణంలో గణేశ్ నిమజ్జన ఉత్సవం జరుపుకోవాలని ఆర్డీవో హరికృష్ణ పేర్కొన్నారు. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే పోచమ్మ చెరువు, పరిసరాలను మంగళవారం ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ జ్యోత్స్నాతో కలిసి ఆయన పరిశీలించారు. నిమజ్జనం రోజు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, సీఐ అష్టలుద్దీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు షేక్ ఆస్మా, రాములు నాయక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

తాండూర్, సెప్టెంబర్ 10 : తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, సీఐ కుమారస్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ కిరణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా, పంచాయతీ కార్యదర్శులతో కలిసి తాండూర్ పెద్ద చెరువు స్థలాన్ని పరిశీలించారు. శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమంలో ఆటంకాలు లేకుండా చెరువు గట్టుమీద వీధి దీపాలతో పాటు, చెరువులోకి ఎక్కువ మందిని పంపించకుండా పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసేలా ముందస్తు ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు.

దండేపల్లి, సెప్టెంబర్ 15 : గూడెం, ద్వారక గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లను లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, సీఐ నరేందర్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. గణేశ్ నిమజ్జనానికి ప్రక్క జిల్లాల నుండి కూడా భారీగా వినాయక ప్రతిమలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, నాయకులు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, రాజన్న, కార్యదర్శులు ఉన్నారు.

యాపల్‌ఏరియాలో బస్‌షెల్టర్ నిర్మించాలి

మందమర్రి, సెప్టెంబర్ 10 : మందమర్రి పట్టణంలోని యాపల్ ఏరియాలో బస్‌షెల్టర్‌ను నిర్మించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. యాపల్ ఏరియాలో నాలుగు వరుసల రహదారిని నిర్మించడం వల్ల గతంలో సింగరేణి జీఎం కార్యాలయ మూల మలుపు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను ఎన్‌హెచ్ఏఐ అధికారులు తొలగించారన్నారు. యాపల్, అంగడిబజార్, కేకేఓసీ ఏరియా కాలనీకి చెందిన వందలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇక్కడి స్టేజీ వద్దనే బస్సుల ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారని తెలిపారు. బస్‌షెల్టర్ తొలగించడం వల్ల ఎండ, వానలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరిగి బస్ షెల్టర్‌ను నిర్మించాలని పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులను గ్రహించి బస్‌షెల్టర్‌ను నిర్మించాలని కోరారు. అనంతరం ఎన్‌హెచ్ఏఐ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎండీ అబ్బాస్, నోముల శ్రీధర్, గోవర్ధన్, నర్సింగ్, ఎండీ మజార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కౌటాల, ఆగస్టు 10 : కౌటాల మండలం ముత్తంపేట, బారెవాడ ప్రాథమిక, కౌటాల జడ్పీఎస్ఎస్ పాఠశాలను మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు మంగళవారం తనిఖీ చేశారు. 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షాకేంద్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వహకులకు ఆదేశించారు. ఆయన వెంట జడ్పీఎస్ఎస్ హెచ్ఎం నారాయణ సింగ్, సీఆర్పీ ప్రకాశ్, ఉపాధ్యాయులున్నారు.

నషాముక్త్ భారత్ అభియాన్ ర్యాలీ

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 10 : కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నషాముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ తీశారు. మద్యం, మత్తు పదార్థాలు, గుట్కా తదితర పదార్థాలకు యువత దూరం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి మనీషా, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : నషా ముక్త్ భారత్ అభియాన్ జాగృతి యాత్రను జయప్రదం చేయాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్ర గత నెల 31న కరీంనగర్‌లో ప్రారంభమైందన్నారు. ఈ నెల 11న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకోనుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీ

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : జాతీయ ఆరోగ్య పథకంలో ఒప్పంద ప్రాతిపదికన మంజూరైన ప్రధానమంత్రి జన్‌మన్ ఎంఎంయూ యూనిట్ కోసం ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో తుకారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య పథకం కింద 8 వైద్య అధికారుల పోస్టులను భర్తీ చేసేందుకు 12న ముఖాముఖి పద్ధతిన దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి రాష్ట్ర వైద్య పరిషత్‌లో రిజిస్టర్ చేయబడిన 6 నెలల సోనోలాజీ కోర్సు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తమ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో సంతకం చేయబడిన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ పత్రాలతో కలెక్టరేట్‌లోని ఎఫ్ 1 బ్లాక్ మొదటి అంతస్తులో హాజరవ్వాలని సూచించారు.

పిచ్చి మొక్కలను తొలగించాలి

మందమర్రి, సెప్టెంబర్ 10 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో గల ఓపెన్ ప్లాట్‌లలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా యజమానులకు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఓపెన్ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి, వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది, సమీప ప్రజలు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. లేకపోతే మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతి

రెబ్బెన, సెప్టెంబర్ 10: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మంగళవారం మార్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించినట్లు తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, నాయకులు మోడెం చిరంజీవిగౌడ్, మడ్డి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రెబ్బెనలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు నిలుపుదల చేసేందుకు ఎస్ఎస్ఆర్ డీఆర్ఎంకు విజ్ఞప్తి చేయాలని కోరినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కార్మికులతో కలిసి సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేశారు. శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ గుర్తింపుకార్డుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టీ దివాకర్ గౌడ్, మెడికల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆసిఫాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీశైలం,కార్యదర్శి మల్లేశ్, కోశాధికారి సత్తార్, కార్మికులు మురళి, మమత, నీల, గుణవంతరావు తదితరులు పాల్గొన్నారు.

'సెంట్రలైజ్డ్ కిచెన్' ఉపసంహరించుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : రాష్